అపద్ధమాడరాదు

కథానిక

విద్వాన్ దస్తగిరి

కంబగిరికి ఎంత సంబరంగ ఉందంటె చెప్పలేనంతగ ఉంది. ఎవరో ఇచ్చిన అర్ధఓళిగ తిన్నట్లు కాక, దండిగ తన ఇంట్లోనే చేసుకొని ఎప్పుడు పడితె అపుడు దినమంతా తిన్నంత సంబరంగా ఉంది. సత్య వాక్కుకు గల మహత్మ్యం గురించి పాఠము చదివినప్పటి నుండి, అయవారు చెప్పి నప్పటి నుండి ఈ విధంగా ఉంది. అపద్ధమాడకుండ నిజమే చెప్పినచో దేవుడే ప్రత్యక్షమై కోరిన కోర్కెలు అనగా రంగు రంగుల టెరీకాటన్ శ్లాగులు, బెల్టు నిక్కర్లు, లడ్డులు, ఓళిగలు, మేడ, కారు, అమ్మకు టెర్లీన్ చీర, నాయనకు గ్లాస్కో పంచ . . . . ఇంకా – ఇంకా – ఎన్నో, ఎన్నెన్నో, దేవతలు దిగివచ్చి, పుష్పక విమానంలో తీసుకొనిపోయి స్వర్గంలో పూల సింహాసనం మీద కూర్చో బెడతారట, అమృతం ఇస్తారట, అది తాగితే చావే లేదట. కల్పవృక్షం దగ్గరకు పోయి ఏది కోరితే అది ఇస్తుందట. ఇన్ని సౌఖ్యాలు తలచుకుంటూనే ఉక్కిరి బిక్కిరిగా ఉందే ఇంక అనుభవంలోకి వస్తే – ఇవన్నీ అయవారు చెప్పినవే! ఆ పాఠాన్ని తాను ఎన్నిసార్లు చదివాడో! హాయి హాయి అనుకుంటున్నాడు.

"హాయి! హాయి!" అనుకుంటున్న వాడు అకస్మాత్తుగా 'అబ్బ' అని ఉలిక్కిపడి తెప్పరిల్లినాడు. కారణం వాల్లమ్మ వీపు మీద 'ఓ దడెం గుద్దు' వేయటమే.

"పాపం పిల్లోడు కాల్లు కాలే ఎండ పొద్దు కాడే కలపరాల్లో తేలిపోతున్నాడే" అంది వాల్లమ్మ.

ఆమె కంబగిరిని ఊరి బయట చింత మాను కిందికి తీసుకు పోయింది. చింత మాను దగ్గరగా ఒక మిద్దె ఉంది. మిద్దె వెనుక మట్టి దిబ్బ, పాడుపడిన గోడలు ఉన్నాయి. వెనుక నుండి మిద్దెను సులభంగా ఎక్కవచ్చు. ఆమె కంబగిరి చేతికి 'బ్యాగు తిత్తి' ఇచ్చి "లే! మెల్లిగ మిద్దెక్కి, పాక్కుంట, పాక్కుంట పోయి, సంచి నిండా రాగులు పోసి, మల్లా పాక్కుంట, పాక్కుంట వచ్చి నా కందీయ్ బద్రం. తలకాయి పైకెత్తినావా – ఒకరాగ్గింజ పోయిందా ఎముకలు సున్నం చేస్తా". కొడుక్కి మొదటి సారిగ పని అప్పగిస్తూ అందామె.

"మనవే నామా రాగులు?" అడిగినాడు కుమార రత్నం.

"అ మనవే. మీ యప్ప, మీ తాత లచ్చలకు లచ్చలు పోసి చెరువు కింద కొనిండ్లా నూరెకరాలు; ఆ నూరెకరాలు పట్టాలోనివి. యాడుండాయిరా కొడుకా మనవి"– పైకెక్కమని సైగ చేసింది.

"పరుల వస్తువులు ముట్టడం పాపం." పుస్తకంలో చదివిన మాటల్ని, అయవారు కంఠస్థం చేయించిన మాటల్ని వప్పగించాడు విద్యార్థి కంబగిరి.

కంబగిరి చెంప చెళ్ళుమంది. ఓ నిమిషం ఎదుట ఉన్న తెల్లని గోడ గోడగా కాక కదులుతున్న ఆవిరి పొగలా కనపడింది.

"చెప్పిన పని చెయ్యమంటే యాలాడే దెవరంటావే. జిత్రెడు లేవు. కన్న తల్లికే అడ్డ నీతులు చెప్తావ్. చెప్పిన పని చేయ్." ఆమె మాటలు

ఊరిమినాయి.

ఇక తప్పదని అమ్మ చెప్పినట్లు పాకి, రాగులు తెచ్చినాడు. ఆమె ఎట్లట్లో తిరిగి వచ్చి మూరకో రంగుగుడ్డ అతుకేసిన చీర అడ్డు చేసుకొని రాగులు ఇంట్లో చేర్చింది. అయినా కొందరు గుర్తించనే గుర్తించారు. ఇంటికి వచ్చిన తరువాత నీతులు చెప్పినందుకు తిట్లు తిన్నాడు కంబగిరి.

సాయంత్రం ఒకాయన కూలికి పిలువ డాని కొచ్చినాడు.

"ఏమండీ రొడ్డి సానిగారూ! రేపన్నా మా మీద దయ జూపుతారా?" అన్నాడాయన. 'రొడ్డి సాని' అనిపిలిచినందుకు ఆమె కిసకిస నగి "ఈ పొద్దంటే ఆ మామ ఊరికే అట్లు బంగక పోతా ఉంటే పోతి" అంది పొయ్యిలేకి పుల్లలెగేస్తు.

"ఊహూ. మామంటే రుసి. అన్న ఏం రుసి? మరి ఇంకెట్లుబంగక పోయేది? కాళ్ళు పట్టు కుందునా ?" అన్నాడు పొయ్యిలో బీడీ ముట్టించు కుంటూ.

"రేపు కచ్చితంగా వస్తా పోన్నా" కుండలో ఎసురు పోస్తూ అంది.

'ఎందుకొస్తావులే. మీ మామ దగ్గరకే పో. ముందుగా కూలిచ్చి పొరపాటు చేసినాను. కూత కూసినంక తప్పరాదు. అది నాలికా! బట్టపేలికా ? వారం నుంచి ఒకటే అసత్యం మాటలు – ఈ పొద్దొస్తా రేపొస్తా – అని. సిల్లర సిల్లర యవారం ఇడిసి పెట్టేల్లేదే. రేపుగిన రాకపోతివో సావిట్లో కట్టేసి నా కూలి ఇచ్చే దంక కదలనీను" అన్నాడాయన ఆరిపోతున్న బీడీని గబ గబ పీలుస్తూ.

ఇంతలోకే సత్యమే పలకమని బోధించే పాఠము చదివి మురిసిపోతున్న కంబగిరి - వాల్లమ్మ మరచి పోయిందనో, అపద్ధ మాడినందు వల్ల వచ్చే నరకం నుండి కాపాడాలనో – ఓ విషయం గుర్తు తెచ్చినాడు. "రేపు వస్తానని వాల్లిట్లో కూలితెస్తివేమా మల్లా రేపు వస్తానని ఈ మామకు చెప్తుండావు" అన్నాడు కంబగిరి.

"ఎపుడు తెస్తిరా కొడకా నేను" కరచినట్లు అందామె.

"సిల్లరదానా! వాన్నే దబాయిస్తున్నావే. ఇగో ఎందుకు నీతో తగాదా. కూలి ముందుగ ఇవ్వడం నాదే బుద్ధి తక్కువ. నీవు రావడమూ వద్దు, చేయడమూవద్దు. నా దుడ్లు నాకీ" అన్నాడాయన కోప కోపంగా.

"యాడా లేదు పోన్నా టక్కుటమారోని మాటలకేం గాని." నవ్వుతూ అందామె.

"అపద్ధ మాడినందుకు నువ్వు నిజమైన దానివి. సత్యం పలికినందుకు వాడు టక్కుటమారోడు. వాదనెందుకు గాన మర్యాదగా నా దుడ్లు నాకీ. నేను మంచికి మంచి. చెడ్డకు పరమ చెడ్డ. నాకు గిని కోపం రేగిందా సూసుకో ఏం చేస్తానో. వారం పొద్దు నుంచి దినామూ టక్కు లేనా. ఛు. ఊ ఇచ్చెయ్. లేకపోతే మాయమ్మ సాచ్చిగ గుండు గొరిగించి చెప్పుల సరము ఏసి గాడిద మీద ఊరేగిస్తా." టవలు గట్టిగా విదలిర్చి భుజం మీద వేసుకున్నాడు.

"రేపు రాకపోతే అట్టే సేత్తువుపోన్నా. అన్నే సంబరపడి ఊరేగిస్తా నంటే సెత్తెలు వద్దంటుందా! బంగారు మాల. మా బీదరికం సెడ్డ. భగవంతుడు ఆ రాత రాసి నాడు. ఎవరేమన్నా అని పించుకో వలసిందే" అంటూ రాని కన్నీరు చెరుగుతో తుడుచుకుంది. ఆ

కన్నీటికి ఆయన గుండె కొంచం కరిగినట్లయింది. "రేపు రాకుంటే సూసుకో" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ మరు క్షణంలోనే "ఒసే తుడుగుదానా! ఎందరుమిసినా నన్ను కాదంటావు గదెనే" అంటూ కడింటి ఆదిశేషమ్మ వచ్చింది.

"ఏం జేసినానని అట్ల మాట్లాడుతున్నావ్" అంది కట్టె విరిచి పొయ్యిలో పెడుతు.

"సెప్తో కొడుదుసా? ముప్పయి రెండు పండ్లు తెరచి యింకా మాట్లాడేవి జేసు. మానంగా దొంగలు కొచ్చిన రాగులు ఇచ్చె" పడేసి తొక్కినట్లు మాట్లాడింది శేషమ్మ.

"ఓహో యవారం బాగుందే! యా సవితి కూసింది. యా నా కొడుకు కూసినాడు. ఊరందరికి నేనేనా అదవ సిక్కిందాన్ని. పోనీ నేను తెచ్చింది నిజమైతే, వాళ్లు చూసిందీ నిజమైతే అప్పుడే పట్టుకోకూడదా. గాడుదులు కాస్తాండిరా. రామా! కృష్ణా! అని ఇపుడొస్తున్నాను. వాళ్లింట్లో గింజలు తెచ్చుకున్నాను. కావాలంటే పద పలికిస్తా." గాలిలో ఊరందరి మొగాలు పొడుస్తా అందామె.

"నోర్ముయ్ దొంగదానా! బో సంపన్నురాలాకట్ల మాట్లాడుతున్నావ్. ఎన్ని దొంగతనాలు పట్టుబడలేదు. ఎన్ని తిట్లు తినలేదు. తన్నులు తినలేదు. ఒరే కంబిగా! ఇట్ల రా రా! చదువు కొనేవాడివి. అపద్ధం చెప్తే పాము వచ్చి కరుస్తుంది. నిజం చెప్పు శేరు బెల్లం యిప్పిస్తా. నువ్వు మీయమ్మ రాగులు తెచ్చినారా, లేదా?" అంది కడింటి ఆదిశేషమ్మ.

కష్టాల మీద కష్టాలొచ్చినా, పరపర కోసినా సరే హరిశ్చంద్రుని మాదిరి సత్యమే చెప్పినచో దేవాన దేవతలొచ్చి పూలవర్షం కురిపిస్తారు. కోరిన కోర్కెలు ఇస్తారు" అన్న అయ్యావారి మాటలు మరింత గట్టిగా వినబడుతున్నాయి. "అపద్ధ మాడరాదు" అన్న పాఠం మరింత స్పష్టంగా కనపడుతోంది కంబగిరికి.

జరిగింది చెప్పినాడు పిల్ల సత్యహరిశ్చంద్రుడు.

"చూడే జగత్ కిలాడి చూడు. దొంగతనం చేసే బదులు కష్టపడు. నాలుగు కాదని పదిండ్లు అడుక్కు తిను" అంటూ వెంట్రుకలుపట్టి ఈడ్చి కొట్టింది. ఇంట్లోకి దూరి కుండలో ఉన్న రాగులు— రేపు కూలికి వస్తానని తెచ్చుకొన్న రాగులు, ఇంకొంచం సేపటిలో సలసల కాగే ఎసుట్లో పడి సంగటి కాబోతున్న రాగిపిండితో సహా - తీసుక పోయింది.

ఇక మన పిల్ల హరిశ్చంద్రుని కష్టాలు చెప్పనలివి కానివి. పూల వర్షం కథ దేవుడెరుగు. తిట్లు దెబ్బల జమిలి వర్షం పిల్లవాడెరుగు. జుట్టు పట్టి జర జర ఈడ్చింది. మో చేతి మో చేతితోనే కొట్టింది. కాళ్ళ కాళ్ళతోనే తొక్కింది. "సత్య అరిచ్చంద్రుడు పోతా పోతా యియ్యప్పని ఉండమన్నాడు కాల్ల" అంది.

"అపద్దాలాడరావని బుక్కులో రాసినారు. అయవారూ చెప్పినాడు" ఎక్కిళ్ళు పడుతు అన్నాడు కంబగిరి.

"యా బుక్కురా బుక్కు" అంటూ బుక్కు పరపరాకులు చేసింది. పొయ్యిలో వేసింది. "అయవారుకేంరా ఏమైనా చెప్తాడు. పట్టి జీతాలొస్తాయి. కుర్చీ మీద కాలు మీద కాలేసుకొని, సిగరెట్టు తాగుతా ఏమైనా చెప్తాడు. ఓనమాల చదువుకే ఇంత కొంప కష్టాలు

స్తుండావే. ఇంకా సదివితే-లేయ్! రేప ట్నుంచి బడికి పోయినావా చూడు. ఖాంచత్! ఎముకలు సున్నం చేసి వకాక్క కేసుకుంటా. గంపెత్తుకొని ప్యాడ పట్టేకి పో. నిజం పలుకుతాడంట నిజం. నిజం చెప్పిన దానికే రాత్రికి గంజి కూడా కరువాయి పోయేనే''– అంటూ దెబ్బలు తిని,తిని; ఏడ్చి, ఏడ్చి యిక ఏడ్వలేక కూలిపోయిన కొడుకును ప్రేమ, శోకం నిండిన వేళ్ళతో పుడుకుతూ- కన్నీటితో తడుపుతూ అమె...

(ఆకాశవాణి కడప కేంద్రం సౌజన్యంతో)

వెన్నెల పాదముద్రలు . . . . విరియాల లక్ష్మీపతి

వైశాఖ పూర్ణిమ నాటి వెన్నెల
శిల్పీకృత రాజహంస;
చల్లగా గుండెలపై వాలింది,
జ్ఞాపకాల వింజామరలు వీచింది.
అప్పుడెప్పుడో ఈ నేలపై
రాజ్యం చేసిన
బాధల తుఫానుల్ని
– ఒక కిరణంతో ముడివేసి
నభోంతరాళానికి లాక్కుపోయింది
చంద్రిక !
వ్యథల కాయాన్ని
శరీరార్థ భాగాన్ని
శయ్యాగారంలో విడిచిన రాత్రి
ఓర వాకిలి నుంచి నిర్దయగా
ఆశా శబ్దం నిష్క్రమించిన రాత్రి
కురిసిన ఆ అశువుల బండరాళ్ళపై
సత్యాన్వేషి పాదముద్రలు . . .
సిలుగుల జడివానలకు కరిగి
ఋతువుల రెక్కల మీంచి దొర్లి
ఈ వసుమతి నంతా నాగుల్లేని
పూల తోటగా మార్చాలన్న జిగీష!
కనురెప్పలపై మూగ వేదనలు
భాషల కందని తత్త్వ గీతాల
నాదామృతంగా
ప్రవహింప చేయాలన్న పిపాస!
ఆదినుండీ అశ్రుకణాల్నే
మోసిన ఈ వెర్రి నేల
చెక్కిలి ఎర్రబడి కందిపోయింది!
షార్కస్ పాదపాలు
చిరుగజ్జల రవళి వినిపించిన చోట
సాహూజిక ఊషరక్షేత్రంపై
జ్ఞాన పత్రాలు రాలుస్తుంది.
అక్కడ చెముడు కాకులు సైతం
కల కూజితాల్నే గానం చేస్తాయి!
కురిసిన వెన్నెలనంతా
సంగీతమయంగా
శిల్పీకరిస్తాయి ! !
ఎక్కడ పర్వతాగ్రాలపై
మౌన తపస్సు చేసుకొని
ఆర్ష చక్షువు తెరుస్తుందో ...
ఆ కడ చూపుల వెలుగు రేకలముందు
సర్వరాజసమూ మోకరిల్లుతుంది ...
ఎదల నివాళు లర్పిస్తుంది!
ఆనాటి సూర్యుడు రాజయోగి.
కాషాయి శాటిలు ధరించినా
పుడమి సతిని వదలి
దూరదూరంగా జరగని విరాగి!
అప్పుడు జాతి
రుజాగ్రవ్యవస్థలోంచి మేల్కొని
విశిష్ట వాస్తవంలోకి నడుస్తుంది.
మౌన ముద్రలు చిందిన
అమల హసనా లానాడు
సర్వసమీరాల్ని ఆరోగ్యవంతం
చేస్తాయి!!